జాతీయస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

- తరలివచ్చిన 8 రాష్ట్రాల క్రీడాకారులు

6


అత్యపత్య పోటీల్లో తలపడు తున్న క్రీడాకారులు

సంక్షేమం.. గజగజ

చలికి వణుకుతున్న సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు

- విరిగిన కిటికీలు, గదుల తలుపులు
- శిథిలావస్థకు చేరిన భవనాలతో పొంచి ఉన్న ముప్పు
- ఇరుకు గదులతో ఇక్కట్లు
- సరిపడని మరుగుదొడ్లు, స్నానపు గదులతో అవస్థలు

విరిగిన కిటికీల తలుపులు.. తలుపులు లేని బాత్‌రూమ్‌లు.. వెలగని లైట్లు.. పెచ్చులూడుతున్న పైకప్పులు ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు ఇవి.. అసలే చలికాలం కావడంతో విరిగిన కిటికీలు, తలుపుల సందుల్లోంచి చల్ల గాలులు లోపలికి రావడంతో విద్యార్థులు చిగురుటాకుల్లా వణికిపోతున్నారు. చాలా చోట్ల వేడినీటి సౌకర్యం లేక, ఉన్న చోట గ్రీజర్లు పని చేయక తెల్లవారుజామున చలిలోనే స్నానాలు చేయాల్సి వస్తోంది. చాలా చోట్ల ఫిల్టర్ నీటి సౌకర్యం లేకపోవడంతో బోరు నీటినే తాగుతున్నారు. ఇంకొన్ని చోట్ల అద్దె భవనాల్లో హాస్టళ్ల నిర్వహణతో ఇరుకు గదుల వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం రాత్రి జిల్లాలోని పలు వసతి గృహాలను 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేసింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు వెలుగులోకి వచ్చాయి.

- మహబూబ్‌నగర్/నారాయణ పేట/నాగర్‌కర్నూల్/వనపర్తి/ గద్వాల, ఆంధ్రజ్యోతి


కొత్తకోట బీసీ బాలుర హాస్టల్‌లో చన్నీటితో స్నానాలు చేస్తున్న విద్యార్థులు


గట్టు హాస్టల్‌లో తలుపులు లేని మరుగుదొడ్లు


శిథిలావస్థ భవనంలో కొనసాగుతున్న ఖిల్లాఘణపురం ఎస్సీ వసతి గృహం

ఆంధ్రజ్యోతి విజిట్

ఉమ్మడి జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు చలికి గజగజ వణుకుతున్నారు. సౌకర్యాలు సరిగా లేక అవస్థలు పడుతున్నారు. జడ్చర్ల పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహం కిటికీలకు తలుపులు లేవు. చలిగాలులు వీస్తుండటంతో విద్యార్థులు కిటికీలకు బెడ్‌షీట్‌లు కట్టుకున్నారు. చన్నీటితోనే స్నానం చేస్తున్నారు. మహబూబ్‌నగర్ మండలం ఎస్సీ బాలికల హాస్టల్‌లో కిటికీలు తుప్పుపట్టాయి. గది పైకప్పు పెచ్చులు ఊడుతున్నాయి. ఫిల్టర్ నీళ్ల లేకపోవడంతో బోరు నీళ్లే తాగుతున్నారు. భోజనశాల లేకపోవడంతో ఆరు బయటే భోజనం చేస్తున్నారు. బాలానగర్ ఎస్సీ హాస్టల్‌లో కిటికీ తలుపులకు రంధ్రాలు పడ్డాయి. వాటిగుండా చల్ల గాలి వీస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కోయిలకొండ మండలంలోని గురుకుల, బీసీ హాస్టల్‌లో కూడా కిటికీలకు తలుపులు లేవు.


గద్వాల హాస్టల్ భవనంలో విరిగిపోయిన తలుపులు

నీటి కొరత

గండీడ్ మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో నీటి కొరత ఉంది. ప్రస్తుతం ఉన్న బోరులోంచి నీరు తక్కువగా వస్తుండటంతో మరో బోరు వేయాల్సిన అవసరం ఉంది. అదనపు గదుల నిర్మాణం పదేళ్ల క్రితమే నిర్మించినా వాడుకలో లేకపోవడంతో వృథాగా ఉన్నాయి.

అద్దె భవనాల్లో ఇక్కట్లు

మిడ్జిల్‌లో సాంఘిక సంక్షేమ

(మిగతా 6లో..)

చన్నీటితో స్నానాలు



ఈ చలి కాలంలో చన్నీళ్లతో స్నానాలు చేయాలంటే వణికిపోతున్నాం. చలికాలం వేడినీళ్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- దివ్య, పదో తరగతి, కోటకొండ జ్యోతిరావుపూలే వసతి గృహం, మరికల్

చలికి వణుకుతున్నాం



భవనం కిటికీలకు తలుపులు లేకపోవడంతో చలికి వణికిపోతున్నాం. దుప్పట్లు కూడా పంపిణీ చేయలేదు. రాత్రంతా నిద్రొస్త లేదు.

- విజయ్, 7వ తరగతి, గిరిజన ఆశ్రమ పాఠశాల, ఖిల్లాఘణపురం

జీవన్మరణ పోరాటం..!

- మాతా శిశు మరణాల కట్టడిలో కనిపించని చర్యలు
- నిత్యకృత్యంగా మారిన నవజాత శిశువుల మరణాలు
- ఎంసీహెచ్‌లో కనిపించని ఆక్సిజన్ వెంటిలేటర్ సదుపాయం

వనపర్తి వైద్య విభాగం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మాతా శిశు మరణాల కట్టడి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ ఫలితాలు భిన్నంగా రావడం కలవరపెడుతోంది. అమ్మ ఒడిలో వెచ్చగా నిద్రపోవాల్సిన శిశువులు అనంత లోకాలకు వెళుతున్నారు. ఈ దుస్థితికి కారణం ఎవరంటే సరైన సమాధానం దొరకదు. మాతా శిశు మరణాలను నివారించాలని గతంలో జిల్లా కేంద్రాల్లో మాతా శిశు సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కానీ సరైన వైద్య సదుపాయాలు కల్పించకపోవడంతో శిశుమరణాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.



వనపర్తి పట్టణంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం

గర్భం దాల్చినప్పటి నుంచి వైద్యుల పర్యవేక్షణలో ఉంటూ ఏఎన్‌సీ పరీక్షలు (యాంటి నెంటల్ చెకప్) క్రమం తప్ప కుండా చేయించుకోవాలి. స్త్రీ వైద్య నిపుణుల సూచనల మేరకు క్రమం తప్ప కుండా చెకప్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ అంశాలపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహ కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కానీ జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకే 61 శిశు మర ణాలతో పాటు 4 మాతృ మరణాలు సంభవించాయి.

కలవరపెడుతున్న మరణాలు...

జిల్లా వ్యాప్తంగా 19 ప్రభుత్వ కాన్పు కేంద్రాలు, 17 ప్రైవేటు కాన్పు కేంద్రాలు ఉన్నాయి. ఇటీవల కుత్బుల్లాపూర్‌కు చెందిన గర్భిణీ మొదటి ప్రసవం కోసం తల్లిగారి ఊరికి వచ్చి వనపర్తి పట్టణంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో అడ్మిట్ అయ్యింది. కాన్పు జరిగిన కొద్ది నిమిషాలకు అధిక రక్తస్రావంతో మృతి చెందింది. ఇలా జిల్లాలో ఈ ఏడాది నాలుగు మాతృ మరణాలు, 61 శిశు మరణాలు జరిగాయి. తక్కువ బరువుతో పుట్టిన బిడ్డకు, బలహీనంగా జన్మించిన శిశువుకు మెరుగైన వైద్యం అందించాలంటే తప్పని సరిగా పీఐసీయూ (పిడియాట్రిక్ ఇంటెన్సివ్‌కేర్ యూనిట్) ఎన్‌ఐసీయూ (న్యూయే న్యాట్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్) విభాగాలు ఉండాలి. వాటికి ఆక్సిజన్, కంప్రెషర్ ఎయిర్, వ్యాక్యూమ్‌లతో కూడిన మూడు పైప్‌లైన్ వెంటిలేటర్ సదుపాయం కూడా ఉండాలి. కానీ జిల్లాలోని ప్రభు ఆస్పత్రిలో ఈ సదుపాయాలు లేకపోవడం నవజాత శిశువులకు శాపంగా మారిందనే చెప్పాలి.

రక్తహీనత ప్రధాన కారణం



మాతృత్వ మరణాలకు రక్తహీనతే ప్రధాన కారణమవుతోంది. పోక్సో చట్టాన్ని అమలు చేసి బాల్య వివాహాలను అరికట్టాలి. గ్రామీణ ప్రజలు గర్భందాల్చిన మహిళలకు కల్లు తాగించడం వల్ల కాన్పు సమయంలో ఫిట్స్ వచ్చే ప్రమాదం ఉంటుంది. గర్భిణులకు ఆశ, అంగన్‌వాడీలు అవగాహన కల్పించాలి.

- డాక్టర్ అరుణకుమారి, గైనిక్ విభాగం హెచ్‌వోడీ, మాతా శిశు సంరక్షణ కేంద్రం, వనపర్తి

క్రమం తప్పకుండా చెకప్ చేయించుకోవాలి



గర్భం దాల్చిన తరువాత పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణులు క్రమం తప్పకుండా చెకప్‌లు చేయించుకోవాలి. బాల్యవివాహాలు, రక్త హీనత కూడా మాతా శిశు మర ణాలకు కారణాలు అవుతు న్నాయి. గర్భిణులకు ఆశ వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు అవగాహన కల్పించాలి.

- డాక్టర్ పరిమళ, ఇమ్యూనైజేషన్ జిల్లా ప్రోగ్రాం అధికారి, వనపర్తి

అసెంబ్లీ సమావేశాల్లో న్యాయవాదుల సమస్యలపై బిల్లు

- పాదయాత్ర చేస్తున్న న్యాయవాదులకు ఎమ్మెల్యేల హామీ

భూత్పూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో న్యాయవాదుల డిమాండ్లను చర్చించే బిల్లు ప్రవేశపెడతామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి హామీ ఇచ్చారు. న్యాయవాదుల రక్షణచట్టం అములు చేయాలని జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గవ్వల శ్రీనివాసులు ఆధ్వర్యంలో 12 మంది న్యాయవాదులు చేపట్టిన చలో హైదరాబాద్ పాదయాత్ర ఈ నెల 9వ తేదీన అలంపూర్ నుంచి ప్రారంభమైంది. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌కు పాదయాత్ర చేరుకున్నది. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా వరంగల్, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి బార్ అసోసియేషన్ల అధ్యక్షులు, బార్ కౌన్సిల్ సభ్యులు అధిక సంఖ్యలో వీరికి స్వాగతంపలకడానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా పాలమూరు బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంతరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులపై జరుగుతున్న దాడులను దృష్టిలో ఉంచుకొని న్యాయవాదులకు రక్షణ చట్టం కావాలని కోరడంలో న్యాయం ఉన్నదన్నారు. ఈ విషయాన్ని ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లి వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెడతామని హామీ ఇచ్చారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ ఇంతటితో పాదయాత్రను విరమించుకోవాలని కోరారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లి సత్వరమే మీ సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. దీంతో పాదయాత్రను ముగించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు అచ్యుతారెడ్డి, నర్సిములు, ఆంజనేయులు, చంద్రశేఖర్‌గౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం వనపర్తి మెడికల్ కళాశాల సమీపంలో ఉన్న బాలసదనంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అక్కడే ఉన్న చిన్నారులతో కలిసి కేక్‌కట్ చేయించి, బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నెహ్రూ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని, ఆయనకు చిన్నారులు అంటే అమితమైన ప్రేమ ఉండేదని, ఆయన జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా వివిధ విభాగాలలో నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంక్షేమశాఖ అధికారిని సుధారాణి, బాలల సంరక్షణ కమిటీ సభ్యులు, తహసీల్దార్ రమేశ్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

ఆయిల్‌పామ్ సాగుపై ప్రత్యేక దృష్టి

- గద్వాల జిల్లాలో 6,720 ఎకరాల్లో తోటలు
- ఈ ఏడాది లక్ష్యం 3,500 ఎకరాలు
- పీఏసీఎస్‌లలో అవగాహన కార్యక్రమాలు

7

పోలీస్‌స్టేషన్ నుంచి పారిపోయిన అంతర్రాష్ట్ర దొంగ

- ఈ నెల 11న విచారణ కోసం కల్వకుర్తికి తీసుకొచ్చిన పోలీసులు
- గురువారం రాత్రి వాష్ రూమ్ వెంటిలేటర్ నుంచి పరారీ

7

అల్ర్పాజోలం పట్టివేత



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 125.00
హోల్ సేల్	: 134.00
డ్రెస్డ్	: 213.00
స్కిన్ లెస్	: 243.00

మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):మహిళా పారిశ్రామికులు వీ-హబ్ ప్రోత్సాహకాలు అందిపుచ్చుకోవాలని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న వీ-హబ్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలని కోరారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, తెలంగాణ వీ-హబ్ ఆధ్వర్యంలో జిల్లాలోని మహిళా పారిశ్రామిక వేత్తలకు మార్కెటింగ్, వ్యాపారాభివృద్ధి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మహిళలు నిర్వహిస్తున్న చిరు వ్యాపారాలను విజయవంతమైన స్టార్టప్‌లుగా అభివృద్ధి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక అభ్యున్నతికి అనేక పథకాలు అమలు చేస్తోందని, అవన్నీ అందిపుచ్చుకుని మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా తమ వ్యాపారం సంస్థలను ముందుకు కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, వీ-హబ్ మహిళా నైపుణ్య అభివృద్ధి సంస్థ డైరెక్టర్ ఊహ, డీఆర్‌డీఏ పీడీ చిన్న ఓబులేష్, డిప్యూటీ కలెక్టర్లు హర్షవర్ధన్, అశోక్, వివిధ శాఖల అధికారులు జిల్లాలోని మహిళా వ్యాపారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

ప్రభుత్వ భూములు కాపాడాలి

- భూ సమస్యల దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి
- కలెక్టర్ బీఎం సంతోష్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. భూ భారతి, సాదాబైనామా తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులలో 6,391 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో వివిధ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి.. ఆ భూములను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. అదేవిధంగా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను తహసీల్దార్‌లు తరుచుగా తనిఖీలు చేస్తుండాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీఓ అలివేలు, ఆయా మండలాల తహసీల్దార్లు ఉన్నారు.


సిర్సవాడ వద్ద దెబ్బతిన్న దుందుభీ నదిలోని కాజ్‌వే

వరద తగ్గినా తీరని కష్టాలు

- భారీ వర్షాలకు పొంగిపొర్లిన దుందుభీ
- సిర్సవాడ సమీపంలో దెబ్బతిన్న కాజ్‌వే
- 4 మండలాలకు నిలిచిన రాకపోకలు

6

కార్పొరేట్‌కు దీటుగా

దాతల సాయంతో ప్రభుత్వ బడుల్లో మెరుగైన వసతులు

- రూ. 2 కోట్లతో పాఠశాల భవనాన్ని నిర్మించిన అరబిందో
- ప్రారంభించిన ఎమ్మెల్యే రాజేశ్ రెడ్డి

బిజినేపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలను అధునీకరించి కార్పొరేట్‌కు దీటుగా వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని వట్టెం జడ్పీహెచ్ఎస్ ఆవరణలో అరబిందో ఫార్మా సహకారంతో రూ.2కోట్లు వెచ్చించి నిర్మించిన నూతన భవనాన్ని అరబిందో ఫార్మా డైరెక్టర్లు శరత్ చంద్రారెడ్డి, సదానంద రెడ్డిలతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా బెంచీలు, గ్రీన్ బోర్డులు, కంప్యూటర్లు అందజేసినట్లు తెలిపారు. మారుతున్న కాలానుగుణంగా విద్యా బోధన సాగినప్పుడే ప్రపంచంతో పోటీపడే నైపుణ్యాలు విద్యార్థులకు అందుతాయని అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అరబిందో ఫార్మా సీఎస్ఆర్ నిధులతో పాఠశాల నిర్మాణానికి కృషి చేసిన నరేందర్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మల్లేపల్లి శ్రీనివాస్ రెడ్డిలకు, స్థలదాతలు పుట్ట వెంకట్‌రెడ్డి, గుబ్బ సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అమృత్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు తిరుపతిరెడ్డి, భగవంత్‌గౌడ్, రాగి మధుసూదన్‌రెడ్డి, ఎంఈవో రఘునందన్ శర్మ, హెచ్ఎం తదితరులు ఉన్నారు.


వట్టెంలో పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే


మరికల్ బీసీ హాస్టల్‌లో స్థలం లేక ఆరుబయట ఆరేసిన దుస్తులు


మాగనూర్ ఎస్సీ హాస్టల్‌లో విరిగిన కిటికీ తలుపులు


ఖిల్లాఘణపురం గిరిజన ఆశ్రమ పాఠశాలలో తలుపులు లేకి కిటికీలు


ప్రహరీ లేని జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ హాస్టల్


'పేట' ప్రభుత్వ బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో దెబ్బతిన్న స్విచ్ బోర్డు


'పేట' ప్రభుత్వ బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో విరిగిన కిటికీలు

సంక్షేమం గజగజ

ఆంధ్రజ్యోతి విజిట్

(5వ పేజీ తరువాయి)

వసతి గృహం అద్దె భవనంలో అరకొర వసతులతో కొనసాగుతోంది. హన్వాడ మండలం ఎస్సీ హాస్టల్‌లో బాత్‌రూమ్‌లు చాలక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. చాలాచోట్ల బెడ్‌షీట్‌లు పంపిణీ చేసినా కిటికీలకు తలుపులు లేక చలికి విద్యార్థులు వణికిపోతున్నారు. ప్రస్తుతం జిల్లాలో 17 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదుకాగా, మున్ముందు మరింత పడిపోయే అవకాశం ఉంది. కిటికీలకు తలుపులు బిగించాలని విద్యార్థులు కోరుతున్నారు.

అరకొర గదులతో ఇక్కట్లు

నారాయణపేట జిల్లా మరికల్ మండలం కోటకొండ జ్యోతిరావు పూలే బీసీ వసతి గృహం అద్దె భవనంలో కొనసాగుతోంది. 443 మంది విద్యార్థులకు 12 తరగతి గదులు, 12 హాస్టల్ గదులు ఉన్నాయి. గదుల కొరత విద్యార్థులకు శాపంగా మారింది. రాత్రి వేళ పడుకునేందుకు అవస్థలు పడుతున్నారు. స్థలం లేక దుస్తులను పక్క ప్లాట్లలో ఆరబెడుతున్నారు. బాత్‌రుమ్‌లు అరకొరగా ఉన్నాయి. చన్నీటితో స్నానాలు చేసేందుకు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

విరిగిన కిటికీలు, డోర్లు

మాగనూర్ ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు చన్నీటి స్నానానికి ఇబ్బందులు పడుతున్నారు. కీటికీలు, డోర్లు సక్రమంగా లేక చలికి వణికిపోతున్నారు. బాత్‌రూమ్‌ల దగ్గర లైట్లు సరిగా లేవు. తాగడానికి ఫిల్టర్ నీరు లేదు. ఇక్కడ 199 మంది విద్యార్థులు ఉంటున్నారు. కోస్గి ఎస్సీ బాలుర వసతి గృహంలో బాత్‌రూమ్‌ల దగ్గర లేటింగ్ లేదు. తాగడానికి ఫిల్టర్ నీరు లేదు. చన్నీటి స్నానాలతో వణికిపోతున్నారు.

సరిపోని నీళ్లు

నారాయణపేట శాతవాహన కాలనీలో అద్దె భవనంలో కొనసాగుతున్న ప్రభుత్వ బీసీ కళాశాల బాలుర వసతి గృహంలో 200 మంది విద్యార్థులు ఉంటున్నారు. కిటికీ తలుపులు విరిగిపోవడంతో చలికి ఇబ్బందులు పడుతున్నారు. పరిసరాలు శుభ్రంగా లేక దుర్వాసన వస్తోంది. చన్నీటితోనే స్నానాలు చేస్తున్నారు. బాత్‌రూంలకు డోర్‌లు సరిగా లేవు. ఉన్న ఒక ట్యాంక్ నీరు సరిపోవడం లేదు. గదుల్లో పైకప్పు పెచ్చులు ఊడి పడుతున్నాయి. స్విచ్ బోర్డులు విరిగిపోవడంతో షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉందని విద్యార్థులు వాపోతున్నారు. రాత్రి వేళలో జ్వరం వస్తే ఆస్పత్రికి వెళ్లేందుకు వార్డెన్, వాచ్‌మన్ అందుబాటులో ఉండటం లేదని చెబుతున్నారు. మెయిన్ గేటు లేకపోవడంతో కుక్కలు, ముగజీవాలు హాస్టల్ ఆవరణలో సంచరిస్తున్నాయి.

శిథిలావస్థ భవనంలో ఇక్కట్లు

జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఉండవెల్లి ఎస్సీ వసతి గృహంలో 110 మంది విద్యార్థులు ఉన్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో 2019 నుంచి రేకుల భవనంలో అద్దెకు నిర్వహిస్తున్నారు. వర్షం వస్తే రేకులు కారుతున్నాయి. మరుగుదొడ్లు రెండే ఉండటంతో చాలామంది విద్యార్థులు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆలంపూర్‌లో బీసీ, ఎస్సీ బాలుర, బాలికల కేజీబీవీలు ఉండగా దాదాపు 420మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కేజీబీవీలో సోలార్ విద్యుత్ పరికరాలు ఉన్నా అవి వినియోగించడంలేదు. దీంతో చన్నీటి స్నానాలే చేస్తున్నారు. ఇదే పరిస్థితి కేటీదొడ్డి కేజీబీవీలో కూడా ఉంది. మల్దకల్ ఎస్సీ బాలుర వసతి గృహానికి ప్రహరీ లేక విషపురుగులు వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. రాజోలి ఎస్సీ బాలుర వసతి గృహంలో 60మంది విద్యార్థులకు ఒకే గది ఉండటంతో అందరు అందులోనే ఉండాల్సిన పరిస్థితి ఉంది. గద్వాలలోని బాలుర వసతి గృహంలో కిటికీలకు తలుపులు లేక చలికి వణికిపోతున్నారు. ఎర్రవల్లి మండలం ధర్మారం బీసీ హాస్టల్‌లో 140మంది విద్యార్థులు ఉన్నారు. వసతి గృహం శిథిలావస్థకు చేరుకుంది. తలుపులు కిటికీలు లేవు. దీంతో విద్యార్థులు పక్కనే ఉన్న పాఠశాలలో పడుకోంటున్నారు. అన్ని వసతి గృహాల్లోని విద్యార్థులుకు కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం అందించలేదు.


కోస్గి ఎస్సీ బాలుర వసతి గృహం వరండాలో చదువుకుంటున్న విద్యార్థులు

డైనింగ్ హాల్‌లో నిద్ర

వనపర్తి జిల్లాలో బీసీ 15, ఎస్సీ 21, ఎస్టీ 5 బాలుర వసతి గృహాల్లో 5,300 విద్యార్థులు ఉంటున్నారు. ఈ వసతి గృహాలకు రెండేళ్లుగా నిధులు లేక సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయి. పాన్‌గల్, అమరచింత మండల కేంద్రాల సమీపంలో ఎస్సీ బాలుర వసతి గృహాలకు ప్రహరీ లేక పోవడంతో విషపురుగులు సంచరిస్తున్నాయి. కొత్తకోట బీసీ బాలుర వసతి గృహానికి తలుపులు, కిటికీలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతు న్నారు. చలికి వణుకుతూ చన్నీటితోనే స్నానం చేస్తున్నారు. ఖిల్లాఘణపూర్ ఎస్సీ, గిరిజన వసతి గృహ భవనం పూర్తిగా శిథిలావస్థలో ఉంది. ఎప్పుడు పెచ్చులూడి పడతాయోనని విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. రాత్రివేళలో విద్యార్థులు డైనింగ్ హాల్‌లోనే నిద్రిస్తున్నారు. పెబ్బేరులో ఉన్న బీసీ బాలుర, బాలికల, కేజీ బీవలు ఉన్నాయి. ఈ మూడు వసతి గృహాల్లో గదులకు కిటికీలు, డోర్ తలుపులు లేక చలికి ఇబ్బంది పడుతున్నారు. వీపనగండ్ల వసతి గృహ విద్యార్థులు చన్నీటితోనే స్నానం చేసుకుంటున్నారు.

పంపిణీ చేయని రగ్గులు

నాగర్‌కర్నూల్ జిల్లాలో మన్ననూర్ గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహంలో రగ్గుల పంపిణీ నేటికీ జరగలేదు. వాటర్ హీటర్లు లేకపోవడంతో చన్నిటీ స్నానం చేస్తున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. వెల్దండలోను బీసీ బాలుర వసతి గృహంలో 170మంది విద్యార్థులు ఉండగా వారు నివసిస్తున్న భవనం శిథిలావస్థకు చేరింది. ఊర్కొండ బీసీ హాస్టల్‌లో స్నానపు గదులు, మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులంతా బయటకు వెళ్లాల్సి వస్తోంది. లింగాల ఎస్టీ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లు, స్నానపు గదులు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. వంగూరు మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరింది. విద్యార్థులు పడుకునే చోట కిటికీ రెక్కలు లేకపోవడంతో చలికి వణుకుతున్నారు. చలికా లంలో వేడినీటిని అందించడానికి రూపకల్పన చేసి సోలార్ హీటర్లు నిరుపయోగంగా మారాయి. అవి ఒక్క రోజు కూడా వేడినీటిని అందించిన దాఖలాలు లేవని విద్యార్థులు అంటున్నారు.

పెచ్చులూడుతున్న పైకప్పు

మక్తల్ ఆనంద నిలయంలో 75 మంది విద్యార్థులు ఉంటున్నారు. బాత్‌రూమ్‌ల తలుపులు విరిగిపోయాయి. కీటికి తలుపులు విరిగిపోవడంతో చలి గాలులకు విద్యార్థులు వణికిపోతున్నారు. పైకప్పు పెచ్చులు ఊడుతుండటంతో భయపడుతున్నారు. నర్వ కస్తూర్బాలో 390 మంది విద్యార్థినులు ఉంటున్నారు. ఇక్కడ కూడా చన్నీటి స్నానాలతో అవస్థలు పడుతున్నారు.


పేట ప్రభుత్వ బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో పెచ్చులూడుతున్న పైకప్పు

కిటికీలకు మరమ్మతులు చేయాలి



జిల్లా కేంద్రంలోని ఆనంద నిలయంలో మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారు. చలికాలం కావడంతో దుప్పట్లు అందించారు. అయితే కిటికీలకు తలుపులు పోయాయి. వాటికి మరమ్మతులు చేస్తే చలి నుంచి కొంత ఉపశమనం వస్తుంది. కాస్మోటిక్ చార్జీలనుఅందించాలి.

- తిరుమలేష్, 9వ తరగతి, గద్వాల

నడిరోడ్డుపై నిలిచిన ప్రైవేటు బస్సు

- ఆందోళనకు గురైన ప్రయాణికులు
- పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఘటన



పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద నడిరోడ్డుపై నిలిచిపోయిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

అలంపూరు చౌర స్తా, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) :ఓ ప్రై వేటు ట్రావెల్స్ బస్సు క్లచ్‌ప్లేట్లు దెబ్బతిని నడిరోడ్డుపై హఠాత్తుగా నిలిచిపోయింది. జోగుళాంబ గద్వాల జిల్లా, అలంపూర్ చౌరస్తా సమీపంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఈ సంఘటన జరిగింది. జబ్బార్ ట్రావెల్స్‌కు చెందిన ఓ బస్సు గురువారం రాత్రి 40 మంది ప్రయాణికులతో హైదరాబాదు నుంచి మైసూర్‌కు బయలుదేరింది. అర్ధరాత్రి సమయంలో పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద హఠాత్తుగా నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ప్రెషర్, క్లచ్ ప్లేట్లు చెడిపోవడంతో బస్సు ఆగిపోయిందని, ప్రయాణికులకు ఇబ్బంది కలుగలేదని డ్రైవర్ సయ్యద్‌బాషా తెలిపారు. ప్రయాణికులను మరో బస్సులో గమ్యస్థానాలకు పంపించినట్లు చెప్పారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

కల్వకుర్తి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పి.వీరబాబు తెలిపారు. కల్వకుర్తి మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లికి చెందిన రాములు, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన కైలాస్ మద్యం తాగి వాహనం నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డారు. పోలీసులు వారిని అరెస్టు చేసి శుక్రవారం కల్వకుర్తి కోర్టులో హాజరుపరిచారు. రాములకు ఒక రోజు, కైలాస్‌కు రెండు రోజుల జైలుశిక్ష, రూ. 600 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత


కలప తరలిస్తున్న లారీని ఫారెస్ట్ కార్యాలయానికి తరలించిన అధికారులు

వనపర్తి టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న కలప లారీని అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. వనపర్తి ఫారెస్ట్ రేంజ్ అధికారి పర్వేజ్ అహ్మద్, సీఐలు తెలిపిన వివరాల ప్రకారం.... వనపర్తి మండలంలోని చిట్యాల చౌరస్తా వద్ద గురువారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా, అనుమానాస్పందంగా కనిపించిన లారీని తనిఖీ చేశారు. అందులో తుమ్మ కలప ఉండటంతో విచారించగా, అనుమతి లేనట్లు తేలింది. దీంతో కలపతో సహా లారీని స్వాధీనం చేసుకొని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. లారీలో దాదాపు 10 టన్నుల కలప ఉందని, నిందితుడిపై కేసు నమోదు చేశామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

ఎయిర్ రైఫిల్‌తో యువకుడి హల్‌చల్

- కౌన్సెలింగ్ ఇచ్చి పంపించిన పోలీసులు


జడ్చర్లలో యువకుడి వద్ద లభించిన ఎయిర్ రైఫిల్

జడ్చర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఎయిర్ రైఫిల్‌తో ఓ యువకుడు హల్ చల్ చేశాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్లలో శుక్రవారం జరిగింది. సీఐ కమలాకర్ తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని ఆల్మాస్ ఫంక్షన్‌హాల్ సమీపంలో నివసించే వకీల్ అనే యువకుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. అతడు తుపాకితో హంగామా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అతడి ఇంటికి వెళ్లి విచారణ చేపట్టగా, అది ఎయిర్‌రైఫిల్ అని తేలింది. పశువు లు, పక్షులను బెదిరించేందుకు దీన్ని వాడుతారని గుర్తించారు. కానీ అది అస లైన తుపాకి మాదిరిగా ఉండటంతో పోలీసులు అతడిని స్టేషన్‌కు పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆ రైఫిల్‌ను వెంట పెట్టుకొని తిరిగితే చర్యలు తీసుకుం టామని హెచ్చరించి పంపించేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కేటీదొడ్డి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు కేటీదొడ్డి ఎస్ఐ పి.శ్రీనివాసులు తెలిపారు. కర్ణాటకలోని గాజులపాడు నుంచి మండలంలోని పాతపాలెం గ్రామానికి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నారని సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ట్రాక్టర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. రాయచూరు జిల్లా, గాజురాల గ్రామానికి చెందిన డ్రైవర్ నాగార్జున, యజమాని సత్యప్పలపై కేసు నమోదు చేశారు.

వరద తగ్గినా తీరని కష్టాలు



సిర్సవాడ వద్ద దుందుభీ నదిలోని కాజ్‌వే పూర్తిగా దెబ్బతినడంతో చెక్‌డ్యామ్ అంచు మీదుగా నడుచుకుంటూ వెళ్తున్న కూలీలు

- భారీ వర్షాలకు పొంగిపోర్లిన దుందుభీ
- సిర్సవాడ సమీపంలో దెబ్బతిన్న కాజ్‌వే
- 4 మండలాలకు నిలిచిన రాకపోకలు
- మరమ్మతు చేయకపోవడంతో తప్పని కష్టాలు

తాడూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : దుందుభీ నదికి వరద తగ్గినా పరిసర గ్రామాల ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. భారీ వర్షాలతో నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూరు మండలంలోని సిర్సవాడ వద్ద దుందుభి నదిపై కాజ్‌వే పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో నాలుగు నెలలుగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సిర్సవాడ నుండి కల్వకుర్తి, ఊర్కొండ, మిడ్జిల్, తలకొండపల్లి మండలాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అలాగే నదికి అవతలివైపు రైతులు సాగుచేసిన వరి, పత్తి పంటలు కోత దశకు వచ్చాయి. ఆ పనులు చేపట్టేందుకు చుట్టూ తిరిగి 40 కిలో మీటర్లు ప్రయాణించి వెళ్లాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుందుభీ నదిపై హైలెవల్ వంతెన మంజూరైందని గత మార్చి 27న అధికారులు ప్రకటించారు. అయినా ఇప్పటివరకు పనులు చేపట్టలేదు. రెవెన్యూ, రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్‌వైభవ్ రఘునాథ్‌లు ఆగస్టు 21న కాజ్‌వేను పరిశీలించారు. నెల రోజుల్లో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అయినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. కనీసం తాత్కాలికంగా సిమెంట్ పైపులు వేసి రహదారిని పునరుద్ధరించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యం

- జోగుళాంబ గద్వాల డీవైఎస్‌వో కృష్ణయ్య



పతకాలు, ప్రశంసాపత్రాలను అందుకున్న విద్యార్థినులతో డీవైఎస్‌వో, అధికారులు, కోచ్‌లు

గద్వాల అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాలికల్లో క్రీడా స్ఫూర్తిని నింపి, నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు అస్మిత అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో కృష్ణయ్య తెలిపారు. గద్వాల పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఖేలో ఇండియా, అస్మిత లీగ్ అండర్-14, 16 అథ్లెటిక్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయి బాలికలను అథ్లెటిక్స్‌లో ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి డాక్టర్ తోట శ్రీనివాసులు మాట్లాడుతూ అండర్-14, 16 బాలికలకు లాంగ్‌జంప్, హైజంప్, జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విజేతలకు పతకాలు, ప్రశం సాపత్రాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీసన్న, కార్యదర్శి సతీశ్, రిటైర్డ్ డీవైఎస్‌వోలు బీఎస్ ఆనంద్, జితేందర్, వ్యాయామ ఉపాధ్యాయులు వీరవసంత రాయుడు, ప్రభాకర్, పీఈటీలు భరత్‌కుమార్, బషీర్, శ్రీనివాసులు, హైమావతి, నాగేశ్ బాబు, రజనీకాంత్, స్రవంతి, రాముల మ్మ, ప్రవీణ, రాఘవేంద్ర, నరేశ్,దేవేందర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

- తరలివచ్చిన 8 రాష్ట్రాల క్రీడాకారులు


జాతీయ స్థాయి అత్యపత్య క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ బ్యాంగి ఆనంద్‌కుమార్

కల్వకుర్తి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి అత్యాపత్య క్రీడా పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నాగర్ కర్నూలు జిల్లా, కల్వకుర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం అందుకు వేదికయ్యింది. కల్వకుర్తి మాజీ సర్పంచ్ బ్యాంగి ఆనంద్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. మన రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, గోవా, బిహార్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీలకు తరలివచ్చారు. కార్యక్రమం నిర్వహణకు వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు వ్యక్తిగతంగా రూ. 50వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో అత్యాపత్య ఆలిండియా జనరల్ సెక్రటరీ దీపక్ కవీశ్వర్, యాక్టింగ్ ప్రెసిడెంట్ శివకుమార్, అత్యాపత్య జిల్లా ప్రెసిడెంట్ ప్రసాద్, ఆర్గనైజర్ అంజి, వెల్దండ మాజీ ఎంపీపీ వెంకటయ్యగౌడ్, మాజీ మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ కొండూరు గోవర్ధన్, సూర్యలతా కాటన్ మిల్ అధ్యక్షులు సూర్యప్రకాశ్‌రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బావండ్ల మ .దు, నాయకులు శ్రీనివాసులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో తొలిరోజు ఉత్తరప్రదేశ్ - పుదుచ్చేరి, గోవా - తమిళనాడు, గోవా - కేరళ, తమిళనాడు - ఉత్తరప్రదేశ్, పుదుచ్చేరి - కేరళ, పుదుచ్చేరి - గోవా, కేరళ - ఉత్తరప్రదేశ్, ఉత్తరప్రదేశ్ - గోవాల జట్లు తలపడ్డాయి. పాయింట్ల ఆధారంగా సెమీఫైనల్‌కు చేరుకున్న జట్లు ఫైనల్లో తలపడనున్నాయి. శనివారం ఫైనల్ మ్యాచ్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

అల్లిపూర్ విద్యార్థినుల ప్రతిభ

- అస్మిత అథ్లెటిక్స్ లీగ్‌లో పతకాలు

చిన్నచింతకుంట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఖేలో ఇండియా, అస్మిత అథ్లెటిక్స్ లీగ్‌లో మహబూబ్‌నగర్ జిల్లా, చిన్నచింతకుంట మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన నందిని అండర్-16 విభాగం, 60 మీటర్ల పరుగు పందెంలో వెండి పతకాన్ని సాధించింది. మానస షాట్‌పుట్‌లో బంగారు పతకాన్ని సాధించింది. వారిద్దరూ అథ్లెటిక్స్ అసోసియేషన్ వనపర్తి జనరల్ సెక్రటరీ నందిమల్ల శ్రీకాంత్, కోచ్‌ల చేతుల మీదుగా పతకాలు అందుకున్నారు.

పేకాట స్థావరంపై దాడి

- ఆరుగురిపై కేసు నమోదు

మానవపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి, ఆరుగురిపై కేసు నమోదు చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా, మానవపాడు ఎస్ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని చంద్రశేఖర్‌నగర్ శివారులో ఉన్న వ్యవసాయ భూమిలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకొని కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ. 21,500 స్వాధీనం చేసుకున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

- డాక్యుమెంట్లతో పాటు, రైటర్లు, సిబ్బంది ఫోన్లు స్వాధీనం
- అవినీతి ఆరోపణలతోనే తనిఖీలు
- ఏసీబీ డీఎస్పీ సీహెచ్ బాలకృష్ణ



మీడియాతో మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ సీహెచ్ బాలకృష్ణ

వనపర్తి/ జడ్చర్ల నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అవినీతి ఆరోపణలు రావడంతో శుక్రవారం మధ్యాహ్నం 3:30 గంటలకు ఏసీబీ మహబూబ్‌నగర్ రేంజ్ డీఎస్పీ బాలకృష్ణ ఇద్దరు ఎస్ఐలు సిబ్బందితో కలిసి కార్యాలయంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కార్యాలయంలో ఉన్న డాక్యుమెంట్ రైటర్లు, కార్యాలయ సిబ్బంది, వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారిని బయటకు వెళ్లకుండా లోపలే ఉంచి వారితో ఉన్న డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించి, రైటర్లు, కార్యాలయ సిబ్బంది వద్ద ఉన్న నగదును స్వాధీనం చేసుకున్నారు. లోపల ఉన్న ప్రతీ ఒక్కరి వివరాలతో పాటు ఏ పని నిమిత్తం వచ్చారనే సమాచారం సేకరించారు. అనంతరం డీఎస్పీ సీహెచ్ బాలకృష్ణ మాట్లాడుతూ కొంతకాలంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై అవినీతి ఆరోపణలు వస్తున్నాయన్నారు. తనిఖీల్లో పలు రికార్డులతో పాటు కార్యాలయ, డాక్యుమెంట్ రైటర్లు, సిబ్బంది ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఎవరైనా ప్రభుత్వ అధికారులు, సిబ్బంది లంచం అడిగితే నేరుగా ఏసీబీ టోల్ ఫ్రీ నెంబరు 1064, 9154388974 కు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ ఇంట్లో సోదాలు

జడ్చర్ల (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వరకాలనీ ఫేస్-1, సరస్వతీ కాలనీలో గల వనపర్తి సబ్ రిజిస్ట్రార్ చంద్రశేఖర్‌రెడ్డి గృహంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఆయన కుటుంబ సభ్యులను ఇంట్లో మూడు తులాల బంగారం ఉన్నట్లుగా గుర్తించినట్లు ఏసీబీ ఇన్‌స్పెక్టర్ జిలానీ తెలిపారు.

భీంపల్లి శ్రీకాంత్‌కు సాహితీ పురస్కారం


సాహితీ పురస్కారం అందుకుంటున్న భీంపల్లి శ్రీకాంత్

మహబూబ్‌నగర్ న్యూటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రముఖ కవి, పరిశోధకుడు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్‌కు తెలుగు సాహిత్య కళాపీఠం వారి సహస్ర పద్య కంఠీరవ చిక్కా రాందాసు స్మారక విశిష్ట పురస్కారం అభించింది. తెలుగు సాహిత్య కళాపీఠం 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో అంతర్జాతీయ ప్రాతికేయ ప్రముఖుడు ఎస్ వెంకటనారాయణ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా డాక్టర్ ఈటెల సమ్మన్న, విశిష్ట అతిథిగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహ్మరెడ్డి, జస్టిస్ నిమ్మ నారాయణతో పాటు, ప్రముఖ కవులు, రచయితలు పాల్గొన్నారు.

కోడె దూడల వేలం

చిన్నచింతకుంట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, కురుమూర్తి క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా స్వామి వారికి భక్తులు సమర్పించిన కోడె దూడలకు శుక్రవారం వేలం నిర్వహించారు. జాతర మైదానంలో 18 కోడె దూడలను వేలం చేపట్టగా, రూ.1.17 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ పాలక మండలి చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈవో మదనేశ్వర్‌రెడ్డి, పర్యవేక్షకుడు తిరుపతయ్య తెలిపారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్, గుంటుకల మధ్య చిక్కుకొని యువరైతుకు తీవ్ర గాయాలు

» కర్నూలుకు తీసుకెళ్తుండగా మృతి


సానే రాజేష్ (ఫైల్)

రాజోలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పొలంలో పత్తికట్టె తొలగిస్తుండగా, గుంటుకకు ట్రాక్టర్‌కు మధ్య చిక్కుకొని ఓ యువరైతు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ గోకారి తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన సానే లక్ష్మీకాంతరెడ్డి కుమారుడు సానే రాజేశ్ (29) శుక్రవారం ఉదయం ట్రాక్టర్‌కు గుంటుక బిగించుకొని పొలంలో పత్తి కట్టెను తొలగించేందుకు వెళ్లాడు. అక్కడ పని చేస్తుండగా గుంటుకలో పత్తికట్టె ఇరుక్కున్నది. దాన్ని తొలగిస్తుండగా లివర్ పైకిలేచింది. దాంతో పాటు ఇనుప గుంటుక కూడా పైకి లేవడంతో దానికి, ట్రాక్టర్‌కు మధ్య చిక్కుకొని తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కూలీలు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు అతడిని కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. సంఘటనపై తల్లి సానే వెంకటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోకారి తెలిపారు.

ఆర్టీసీ బస్సులో వ్యక్తి కన్నుమూత

దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా గుండెపోటు


బస్సులో గుండె పోటుతో మృతి చెందిన హరికృష్ణ

మహబూబ్‌నగర్ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : దైవదర్శనానికి వెళ్లి, ఆర్టీసీ బస్సులో తిరిగి వస్తూ ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ రూరల్ మండల పరిధిలోని బొక్కలోనిపల్లి శివారులో జరిగింది. 108 అంబులెన్సు సిబ్బంది, బస్సు కండక్టర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడం జిల్లా, టేకులపల్లికి చెందిన హరికృష్ణ (35) అనే వ్యక్తి కర్ణాటక రాష్ట్రంలోని దేవసూర్ ఆలయాన్ని దర్శించుకొని శుక్రవారం ఆర్టీసీ బస్సులో తిరుగుప్రయాణం అయ్యాడు. మార్గంమధ్యలో గుండెపోటు రావడంతో స్పృహతప్పి కిటికీవైపు ఒరిగిపోయాడు. మధ్నాహ్నం 12:20 గంటల సమయంలో బస్సు బొక్కలోనిపల్లి శివారుకు చేరుకోగా, తోటి ప్రయాణికులు గమనించారు. పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. దీంతో 108 అంబులెన్సుకు, పోలీసులకు, బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోయిలకొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కోయిలకొండ ఎస్ఐ తిరుపాజీ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, కోయిలకొండ మండలంలోని పల్లుతండాకు చెందిన వడ్డె చెన్నప్ప (45) ఈనెల 12న బావమరిది మొగులయ్యలతో కలిసి ద్విచక్రవాహనంపై వింజమూరుకు వెళ్లాడు. రాత్రి తిరిగి వస్తుండగా కానుగుబండతండా వద్దనున్న మలుపు వద్ద జీవికుంటతండాకు చెందిన డ్రైవర్ సంజు ట్రాక్టర్‌ను వేగంగా నడుపుతూ ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో బైక్‌పై ఉన్న చెన్నప్ప, మొగులయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని జిల్లా ఆసుపత్రికి తరలించగా గురువారం చెన్నప్ప మృతి చెందాడు. మొగులయ్య చికిత్స పొందుతున్నాడు. సంఘటనపై మృతుడి కుమారుడు వడ్డె ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కారును ఢీకొట్టిన బస్సు

» దాన్ని ఢీకొన్న మరో బస్సు » ప్రయాణికులు సురక్షితం


బోల్తా పడిన కారు



ధ్వంసమైన రెండు బస్సుల అద్దాలు

మానవపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి 44పై మూడు వాహనాలు ఒకదానినొకటి ఢీకొన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, మానవపాడు మండలంలో జరిగింది. హైదరాబాద్ నుంచి కర్నూల్ వెళ్తున్న కారును, అదే వైపు వస్తున్న కారు గద్వాల ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొన్నది. దీంతో కారు రోడ్డుపక్కకు బోల్తాపడింది. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన మరో ప్రైవేటు బస్సు ఆర్టీసీ బస్సును ఢీకొన్నది. ప్రమాదంలో రెండు బస్సు అద్దాలు ధ్వంసం అయ్యాయి. ప్రమాదం జరిగినప్పుడు రెండు బస్సుల్లో దాదాపు 50 మంది ప్రయాణికులు ఉన్నారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ చంద్రకాంత్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సంఘటనపై కేసు నమోదు చేస్తామని చెప్పారు.

పోలీసుస్టేషన్ నుంచి పారిపోయిన అంతర్రాష్ట్ర దొంగ

» ఈ నెల 11న విచారణ కోసం కల్వకుర్తి స్టేషన్‌కు తీసుకొచ్చిన పోలీసులు
» వాష్ రూమ్ వెంటిలేటర్‌లో నుంచి పరారీ


రిమాండ్ ఖైదీ నాగిరెడ్డి పారిపోయిన పోలీస్‌స్టేషన్ వాష్ రూమ్‌లోని వెంటిలేటర్

కల్వకుర్తి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పోలీసు కస్టడీలో ఉన్న రిమాండ్ ఖైదీ తప్పించుకొని పారిపోయిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో వెలుగు చూసింది. నంద్యాల జిల్లా కొత్త పల్లి మండలం వీరాపురం గ్రామానికి చెందిన అంతర్రాష్ట్ర దొంగ తెలుగు నాగి రెడ్డి(33) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సుమారు 50 దొంగతనాలకు పాల్పడ్డాడు. జైలు జీవితం సైతం గడిపాడు. అనంతపూర్ జిల్లా విడపనకల్ పోలీసు స్టేషన్ పరిధిలో అక్టోబరు మొదటి వారంలో ఓ రోడ్డు ప్రమాదానికి కారణమై, గాయపడిన నాగిరెడ్డిని పోలీసులు అరెస్టు చేసి అనంతపూర్ జైలుకు తరలించారు. కల్వకుర్తిలో జరిగిన దొంగతనాల్లో నాగిరెడ్డికి సంబంధం ఉన్నట్లు తేలడంతో అతన్ని పీటీ వారెంట్ ద్వారా అనంతపూర్ జైలు నుంచి ఈ నెల 11న కల్వకుర్తి పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. నాగిరెడ్డిని కల్వకుర్తిలో పోలీసులు విచారించగా ఇటీవల ఐదు దొంగతనాల్లో పాల్గొన్నానని తెలిపినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. గురువారం రాత్రి 9:30 గంటల ప్రాంతంలో నడుముకు బెల్టు, నడవడానికి స్టాండ్‌తో ఉన్న నాగిరెడ్డి వాష్‌రూమ్‌కు వెళ్తానని కోరడంతో డ్యూటీలో ఉన్న పోలీసులు పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే ఉన్న రెస్టురూంలోని వాష్‌రూమ్‌కు పంపించి, తలుపు ముందు కాపలా ఉన్నారు. 15 నిమిషాల వరకు మాట్లాడుతూనే ఉన్నప్పటికీ కొంత సమయానికి అతను పలకకపోవడంతో తలుపును తీశారు. అప్పటికే వాష్‌రూమ్‌లోని వెంటిలేటర్‌లో నుంచి పారిపోయాడని పోలీసులు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు నాగిరెడ్డిని గుర్తించడానికి కల్వకుర్తి డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, పోలీసు సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి తనిఖీలు ప్రారంభించారు. జిల్లా పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్లను అలర్ట్ చేసి ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. కస్టడీలో ఉండి పారిపోయిన రిమాండ్ ఖైదీ నాగిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుపై ప్రత్యేక దృష్టి

» గద్వాల జిల్లాలో 6,720 ఎకరాల్లో తోటలు
» ఈ ఏడాది లక్ష్యం 3,500 ఎకరాలు
» పీఏసీఎస్‌లలో అవగాహన కార్యక్రమాలు


గద్వాల మండలం, కొత్తపల్లి గ్రామంలోని అయిల్ పామ్ తోట

గద్వాల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పామ్ సాగుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాయి. ఇతర దేశాల నుంచి ఆయిల్ దిగుమతులను తగ్గించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాయి. దేశంలోనే ఆయిల్ ఉత్పత్తులను పెంచేందుకు కృషి చేస్తున్నాయి. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును పెంచేందుకు జిల్లాల వారీగా లక్ష్యాలను విధించింది. కానీ ఆశించిన స్థాయిలో లక్ష్యాలను చేరుకోవడం లేదు. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన లేకపోవడంతో రైతులు ముందుకు రావడం లేదు. కానీ ప్రభుత్వం మాత్రం లక్ష్యం భారీగానే నిర్దేశించింది.

జోగుళాంబ గద్వాల జిల్లాలో 2020-21లో 250 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా, 100 శాతం పూర్తయింది. 2021-22లో 1,500 ఎకరాల లక్ష్యం కాగా, 1,480 ఎకరాలలో సాగయ్యింది. 2022-23లో 4,690 ఎకరాల లక్ష్యం నిర్దేశించగా, 2,863 ఎకరాల్లో మాత్రమే సాగయ్యింది. 2023-24లో 5,800 ఎకరాలు సాగు లక్ష్యం కాగా, 1,611 ఎకరాలలో మాత్రమే సాగు చేశారు. 2024-25లో 3 వేల ఎకరాల లక్ష్యం కాగా, కేవలం 517 ఎకరాల్లో మాత్రమే ఆయిల్ పామ్ సాగయ్యింది. మొదటి రెండేళ్లలో మాత్రమే 100 శాతం లక్ష్యం పూర్తి కాగా, ఆ తర్వాత సంవత్సరాల్లో లక్ష్యాన్ని చేరుకోలేదు. రైతులకు అవగాహన లేకపోవడం వల్లే సాగు లక్ష్యం నెరవేరడం లేదని అధికారులు చెప్తున్నారు.

సహకార సంఘాల సహకారం

ఆయిల్ పామ్‌పై జిల్లాలోని సహకార సంఘాల సహకారంతో రైతులకు అవగాహన కల్పించి సాగు విస్తీర్ణం పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాది 3,600 ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది. అందుకోసం జోగుళాంబ గద్వాల జిల్లాలోని 11 ప్రాథమిక సహకార సంఘాల ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇప్పటికే గద్వాల, ధరూర్, మానవపాడు, రాజోలి, అయిజ పీఏసీఏస్‌లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే సాగులో ఏమైనా సమస్యలుంటే పరిష్కరిస్తున్నారు. దీంతో రైతులు ముందుకొచ్చి 1500 ఎకరాల్లో సాగుకు దరఖాస్తు చేసుకున్నారు. అందులో 800 ఎకరాలల్లో రిజిస్ట్రేషన్ అయ్యాయి. 340 ఎకరాల్లో మొక్కలు నాటారు. మరో 6 పీఏసీఎస్‌లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది.

ఆయిల్ పరిశ్రమ ఏర్పాటులో జాప్యం

ఆయిల్‌పామ్ సాగును పెంచి, ఇక్కడే మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు బీచుపల్లిలో ఆయిల్ పరిశ్రమను ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. అందుకోసం భూమి పూజ కూడా చేశారు. కానీ ఇప్పటి వరకు నిర్మాణ పనులు మొదలు పెట్టలేదు. 2020-21, 20221-22లో రైతులు సాగు చేసిన తోటల్లో ప్రస్తుతం గెలలు వస్తున్నాయి. వీటిని అశ్వారావుపేటలో ఉన్న ఆయిల్ పరిశ్రమకు తరలిస్తున్నారు. మరో ఏడాది దాటితే మరికొన్ని ఎకరాలలో కూడా గెలలు వస్తాయి. జిల్లాలోనే పరిశ్రమను ఏర్పాటు చేస్తే రైతులకు ఇబ్బందులు ఉండవు. అదే విధంగా ఇక్కడే పరిశ్రమ ఉంటే ఈయిల్ పామ్ సాగుపై రైతులకు మరింత నమ్మకం ఏర్పడి, ఎక్కువ మంది సాగు చేపట్టే అవకాశం ఉంది. కానీ ఆయిల్ ఫెడ్ వారు మాత్రం గద్వాల, నారాయణపేట జిల్లాల్లో 10 వేల ఎకరాల్లో పంట కోతకు వస్తే తప్ప ఏర్పాటు చేయలేమని ప్రకటిస్తున్నారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి

రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలి. తక్కువ పెట్టుబడితో ఏళ్ల తరబడి రాబడి పొందే పంట ఇదే. ప్రస్తుతం రైతులు సాంప్రదాయ పంటలను సాగు చేస్తున్నారు. వాటిలో పెట్టుబడితో పాటు రిస్క్ అధికంగా ఉంటుంది.

ఆదాయం తక్కువగా లభిస్తుంది. అయిల్ పామ్ సాగులో ఒక్కసారి పెట్టుబడి పెడితే 30 ఏళ్ల వరకు ఆదాయం పొందొచ్చు.

- ఎంఏ సుబాన్, పీఏసీఎస్ అధ్యక్షుడు, గద్వాల

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



సహకార సంఘాల అధ్యక్షులు, సీఈఓల సహకారంతో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. కార్యక్రమాలు విజయవంతం అవుతున్నాయి. మరికొన్ని పీఏసీఎస్‌లలో నిర్వహించాల్సి ఉంది. రైతు లు సాగు చేపట్టేందుకు ముందుకొస్తున్నారు. లక్ష్యాన్ని పూర్తి చేస్తామనే నమ్మకం ఉంది.

- అక్బర్ అలీ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గద్వాల

కుంకుమ పువ్వు సాగుతో అధిక ఆదాయం

» నాబార్డు, ఉద్యాన కళాశాల ఆధ్వర్యంలో శిక్షణ


కుంకుమ పువ్వు సాగుపై శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం మనోహర్‌రెడ్డి

పెద్దమందడి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కుంకుమ పువ్వు సాగుతో అధిక లాభాలు గడించొచ్చని నాబార్డు మహబూబ్‌నగర్ క్లస్టర్‌జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ పి.మనోహర్‌రెడ్డి అన్నారు. నాబార్డు ఆర్థిక సాయంతో, మోజర్ల ఉద్యాన కళాశాలలో ఏరోపోనిక్ పద్ధతిలో ప్రయోగాత్మకంగా చేపట్టిన కుంకుమ పువ్వు సాగుపై శుక్రవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసక్తి ఉన్న యువ రైతులు కుంకుమ పువ్వు సాగు చేపట్టి లాభాలు పొందవచ్చున్నారు. పువ్వు ప్రాజెక్టు ప్రధాన పరిశోధకుడు ప్రొఫెసర్ పీడిగం సైదయ్య మాట్లాడుతూ కశ్మీరు వాతావరణాన్ని కృత్రిమంగా సృష్టించి కుంకుమ పువ్వును ఎలా పెంచాలో విద్యార్థులు రైతులకు వివరించారని తెలిపారు. ఏరోపోనిక్ పద్ధతిలో కుంకుమ పువ్వు దిగుబడి, నాణ్యతలను పెంచేందుకు మరిన్ని పరిశోధనలు చేస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారికి శిక్షణ, సాగులో మెళకువలు నేర్పించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. శిక్షణకు 50 మంది యువకులు హజరయ్యారు. కార్యక్రమంలో డాక్టర్ షహనాజ్ తదితరులు పాల్గొన్నారు.

యూనిటీ మార్చ్ విజయవంతం చేయాలి

» మేరా యువ భారత్ ఉమ్మడి జిల్లా అధికారి వి.కోటనాయక్



జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మేరా యువ భారత్ ఉమ్మడి జిల్లా అధికారి వి.కోటనాయక్

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించనున్న యూనిటీ మార్చ్‌ను విజయవంతం చేయాలని మేరా యువ భారత్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధికారి వి.కోటనాయక్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని దేవకీ పంక్షన్‌హాలులో శుక్రవారం మేరా యువ భారత్ జిల్లా కన్వీనర్ నాగేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్దార్ వల్లభ బాయ్ పటేల్ 150 జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని జెడ్పీ మైదానం నుంచి మార్చ్ ప్రారంభం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మేరా భారత్ జాతీయ ప్రతినిధి, గుజరాత్ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ జస్వంత్‌సింగ్‌తో పాటు కలెక్టర్, ఎస్పీలు పాల్గొననున్నారని తెలిపారు. కార్యక్రమంలో మేరా భారత్ జిల్లా కన్వీనర్ నాగేందర్‌గౌడ్, కోకన్వీనర్ విజయేందర్,కోఆర్డినేటర్ రాజేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

దాడి కేసులో వ్యక్తి అరెస్టు

గద్వాల క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : దాడి కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు శుక్రవారం గద్వాల పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని షేరెల్లివీధికి నోమన్ అనే వ్యక్తి కొన్నిరోజుల క్రితం చెనుగోనిపల్లికి చెందిన నర్సింహులు అనే వ్యక్తిపై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, శుక్రవారం నోమన్‌ను అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు. న్యాయాధికారి ముందు హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితుడిపై గతంలోనూ పలు కేసులు ఉన్నట్లు చెప్పారు.

అల్ప్రాజోలం పట్టివేత

» నలుగురి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు
» డీఎస్పీ బుర్రి శ్రీనివాస్‌యాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ బుర్రి శ్రీనివాస్‌యాదవ్

కందనూలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నిషేధిత అల్ప్రాజోలంను పట్టుకుని, నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు నాగర్‌కర్నూల్ డీఎస్పీ బుర్రి శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మునిసిపాలిటీ పరిధిలో, ఉయ్యాలవాడ సమీపంలోని గోల్డెన్ కేఫ్ సమీపంలో అల్ప్రాజోలం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో నాగర్‌కర్నూల్ ఎస్ఐ గోవర్ధన్ ఆధ్వర్యంలో పోలీస్ బృందం దాడి చేసింది. బిజినేపల్లి మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన వంగ ఆంజనేయులుగౌడ్, లింగసానిపల్లికి చెందిన గార్లపాటి పురుషోత్తంగౌడ్, తాడూరు మండలంలోని చెర్లతిర్మలాపూర్ గ్రామానికి చెందిన గుళ్లోలు సాయిరాం, ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన మైల శివశంకర్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి దాదాపుగా 26.22 గ్రాముల అల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్నారు. గంజాయికి అలవాటు పడిన సాయిరాం, శివశంకర్‌లు అది దొరకకపోవడంతో అల్ప్రాజోలం కొనుగోలు చేసి, శీతల పానీయంలో కలుపుకొని తాగేందుకు యత్నిస్తుండగా, పట్టుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ అశోకొరెడ్డి, ఎస్ఐ గోవర్ధన్, పోలీసులు భీముడు, వెంకటేశ్, రమేశ్ పాల్గొన్నారు.

కార్డులు మార్చి.. ఏమార్చి..

» ఏటీఎంల నుంచి నగదు స్వాహా
» ఇద్దరు నిందితుల అరెస్టు
» రూ.40 వేలు స్వాధీనం
» మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సాయం చేసే నెపంతో ఏటీఎం కార్డులను మార్చి, వారి ఖాతాల్లో నుం చి నగదును కాజేస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. మహబూబ్‌నగర్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు వివరాలను వెల్లడించారు. హరియాణా రాష్ట్రంలోని హిసార్ జిల్లాకు చెందిన సన్ని, రాజేశ్ అనే యువకులు ఏటీఎం కేంద్రాల వద్ద తిరుగుతూ, డబ్బు డ్రా చేసేందుకు ఇబ్బంది పడ్తున్న వారికి సాయం చేసే నెపంతో వారి కార్డును మార్చేసి, వారి ఖాతాల్లో నుంచి డబ్బు డ్రా చేసుకుంటున్నారు. అలాగే ఈనెల 10న న్యూటౌన్ ఎస్‌బీఐ ఏటీఎంలో వెంకటేశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి డబ్బు డ్రా చేసేందుకు ఇబ్బంది పడుతుండగా, అక్కడే ఉన్న ఇద్దరు నిందితులు గుర్తించారు. ఆయన వద్ద కార్డు తీసుకుని అలాంటి కార్డే మరొకటి ఇచ్చి, అందులో నుంచి రూ.40 వేలు డ్రా చేశారు. మరుసటి రోజు శుక్రవారం వారిద్దరూ కాస్మిక్ బేకరీ సమీపంలోని హెచ్‌డీ ఎఫ్‌సీ ఏటీఎం వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో ఐడీ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించడంతో, నేరాలను అంగీకరించారు. అలాగే మూడు నెలల క్రితం మిడ్జిల్‌లోని ఏటీఎం కేంద్రం వద్ద ఓ వ్యక్తి కార్డు ను మార్చి రూ.40 వేలు డ్రా చేసుకున్నారు. వారి నుంచి పాలమూరు కేసులో రూ.30 వేలు, మిడ్జిల్ కేసులో రూ.10 వేలు రికవరీ చేశారు. వారి నుంచి బుల్లెట్ బైక్‌తో పాటు వివిధ బ్యాంకులకు చెందిన 15 ఏటీఎం కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఏటీఎం కేంద్రాల వద్ద అపరిచితుల సాయం తీసుకో వద్దని, అవసరమైతే కుటుంబ సభ్యులను వెంట తీసుకెళ్లాలని డీఎస్పీ సూచించారు. కేసును ఛేదించి, నిందితులను పట్టుకున్న పోలీసులు, ఐడీపార్టీ కానిస్టేబుళ్లకు రివార్డులు అందిస్తామన్నారు. సమావేశంలో టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్, ఎస్ఐ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

17న ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లను ఈనెల 17న ఎంపిక చేయనున్నట్లు ఖోఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు నాగర్‌కర్నూల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారు త్వరలో సంగారెడ్డిజిల్లా, పటాన్‌చెరువులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు జనన ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డులతో ఉదయం 9 గంటలకు పీడీ నిరంజన్‌యాదవ్‌కు రిపోర్టు చేయాలని కోరారు.

నేడు షటిల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15న ఉమ్మడి జిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శారదాబాయి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 17 క్రీడాకారులు స్కూల్ బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో ఉదయం 9 గంటలకు స్టేడియం మైదానంలో వ్యాయామ ఉపాధ్యాయుడు సాదత్‌ఖాన్‌కు రిపోర్టు చేయాలని కోరారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఘర్షణ

» పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇరువర్గాలు


తహసీల్దార్ కార్యాలయం ముందు ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

మిడ్జిల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద యూట్యూబర్లు, స్థానిక నాయకులకు మధ్య ఘర్షణ జరిగింది. మండల కేంద్రంలోని ఆగస్టు 15న గ్రామస్తులు రాకముందే తహసీల్దార్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ విషయంపై ఆయనను కొందరు ప్రశ్నించగా, మిడ్జిల్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో పీఎంవోకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదును పరిశీలించాలని డీజీపీతో పాటు జిల్లా పోలీసు అధికారులకు పీఎంవో నుంచి ఆదేశాలు వచ్చాయి. దీనిపై వివరణ కోరేందుకు కొందరు యూట్యూబర్లు గురువారం తహసీల్దార్ రాజును ప్రశ్నిస్తుండగా, స్థానిక కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. దీంతో యూట్యూబర్లుకు, వారికి మధ్య ఘర్షణ జరిగింది. సంఘటనపై ఒకరిపై మరొకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

ఇంటర్వ్యూ..

మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నాం

- శ్రీనివాసులు, సింగిల్‌విండో సొసైటీ సీఈవో



కొల్లాపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మండల పరిధిలోని గ్రామాలలో రైతులు పండించిన మొక్కజొన్న పంటను స్థానిక మార్కెట్ యార్డులో సింగిల్‌విండో సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్నట్లు సింగిల్‌విండో సొసైటీ సీఈవో శ్రీనివాసులు ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో తెలిపారు.

ప్రభుత్వం మొక్కజొన్నకు ఎంత మద్దతు ధర ఇస్తుంది?

ప్రభుత్వం క్వింటాలు మొక్కజొన్నకు 2400 రూపాయలు మద్దతు ధర చెల్లిస్తుంది. కొల్లాపూర్ మండల పరిధిలోని గ్రామాల రైతులు స్థానిక మార్కెట్ యార్డులోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో విక్రయించవచ్చు.

ఎకరాకు ఎన్ని క్వింటాళ్ల కొనుగోలు చేస్తున్నారు?

ప్రభుత్వం ఆదేశానుసారం ఎకరాకు 25 క్వింటాళ్ల మొక్కజొన్న పంటను కొనుగోలు చేస్తున్నాం. గతంలో 18.5 క్వింటాళ్లు కొనుగోలు చేసేలా ఉన్న ఆదేశాలు ప్రస్తుతం 25 క్వింటాళ్లకు పెరిగింది.

కొనుగోలులో నిర్లక్ష్యం జరుగుతుందా?

తేమ శాతం లేని మొక్కజొన్న పంటను కొనుగోలు చేయడం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమశాతం ఉన్న మొక్కజొన్న పంటను కొనుగోలు చేస్తున్నాం. ఎలాంటి నిర్లక్ష్యం జరగదు. రైతులకు అందుబాటులోనే ఉంటున్నాం.

న్యూస్ బాక్స్

శ్రీశైల దేవస్థానం ట్రస్ట్ ధర్మకర్తల మండలి సభ్యునికి సన్మానం

అచ్చంపేటటౌన్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల మల్లికార్జున భ్రమరాంబ దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడిగా ఎన్నికైన చిలువేరు కాశీనాథంను అచ్చంపేట పద్మశాలి సంఘం అధ్యక్షుడు కోట కిషోర్, వినయ్ కుమార్‌లు శుక్రవారం హైదరాబాద్‌లోని పద్మశాలి నిత్యాన్నదాన సత్రం కార్యాలయంలో కలిసి శాలువాతో సన్మానించారు. శ్రీశైలం పుణ్యక్షేత్రంలో సర్వదర్శనం గదుల కేటాయింపులో పద్మశాలిలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని ఆయనకు విజ్ఞప్తి చేశామన్నారు. అచ్చంపేట పద్మశాలి భక్త మార్కండేయా మహిళా సంఘం నుంచి పద్మశాలి నిత్యాన్నదాన సత్రం అభివృద్ధికి తగిన సహాయ సహకారాలు అందించేందుకు కట్టుబడి ఉంటామని భరోసా ఇచ్చారు.

బిహార్ గెలుపుపై బీజేపీ సంబురాలు



బాణసంచా కాలుస్తున్న బీజేపీ నాయకులు

ఊర్కొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించడంతో శుక్రవారం బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారి వద్ద బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్, నాయకులు లక్ష్మారెడ్డి, ఆంజనేయులు, పరశురాములు, సందీప్‌కుమార్, లక్ష్మణ్‌గౌడ్ ఉన్నారు.

● మన్ననూర్ (ఆంధ్రజ్యోతి) : బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ విజయం సాధించడంపై బీజేపీ నాయకులు మిఠాయిలు పంచి, బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెలిజాల శ్రీనివాసులు, నారాయణమ్మ, పులిజాల శేఖర్, పెర్మాల ప్రసాద్, బాలకృష్ణ పాల్గొన్నారు.

కుక్కల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలి : సీపీఎం

కొల్లాపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మునిసిపాలిటీలో కుక్కలు, పశువులు, పందుల బెడద నుంచి ప్రజలను కాపాడాలని సీపీఎం నాయకులు కోరారు. శుక్రవారం సీపీఎం మండల కార్యదర్శి శివ వర్మ, పట్టణ కార్యదర్శి ఎండీ సలీం ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. వీధి కుక్కలతో చిన్నారుల ప్రాణాలుపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. సీపీఎం నాయకులు సాయికుమార్, సురేష్, రాజు, సంజయ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

అమ్రాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. స్థానిక జడ్పీహెచ్ బాలుర పాఠశాలలో వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు ఎంఈవో బాలకిషన్ ఆధ్వర్యంలో బహుమతులను అందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. మండల పరిధిలోని మలకమామిడి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆర్డీటీ ఆధ్వర్యంలో అచ్చంపేట నియోజకవర్గంలోని వివిధ పాఠశాలలకు చెందిన 4, 5తరగతుల విద్యార్థులను తీసుకొచ్చి వివిధ రకాల పోటీలు నిర్వహించి ప్రత్యేక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఏరియా టీం లీడర్ రామ్మోహన్, డాక్టర్ సైపుల్లాఖాన్, హెచ్‌ఎం దశరథ్, గ్రామంలోని వివిధసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రజాపాలనకు జనం ఇచ్చిన తీర్పు ఇది

- జూబ్లిహిల్స్ ఉప ఎన్నికలో గెలుపుపై కాంగ్రెస్ నాయకుల హర్షాతిరేకాలు
- మరో పదేళ్లపాటు కాంగ్రెస్‌దే అధికారమన్న నాయకులు

నాగర్‌కర్నూల్/ కొల్లాపూర్/ కల్వకుర్తి/ బిజినేపల్లి/ వెల్దండ/ ఊర్కొండ/ కోడేరు/ తెలకపల్లి/ లింగాల/ మన్ననూర్/ చారకొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం పై జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నాయి. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డి, కూచకుళ్ల రాజేశ్‌రెడ్డిలు యూసుఫ్‌గూడ, బోరబండ, ఎర్రగడ్డ ప్రాంతాల్లో ఇన్‌చార్జీలుగా వ్యవహరించి, ప్రచారం చేశారు. అక్కడ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం రాత్రింబవళ్లు శ్రమించారు. మరో పదేళ్లు కాంగ్రెస్‌దే అధికారం అని ఎంపీ మల్లు రవి అన్నారు. ప్రజాపాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు ఇది అని అభిప్రాయపడ్డారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు క్రమ శిక్షణతో సమష్టిగా కృషి చేసి కాంగ్రెస్‌ను విజయతీరాలకు చేర్చారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఇదే స్ఫూర్తితో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని కార్యకర్తలను కోరారు. కాంగ్రెస్ ప్రజాపాలనకు జనం ఇచ్చిన తీర్పు ఇది అని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తా చాటుతామని స్పష్టం చేశారు. విపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలకు చెంపపెట్టు లాంటిదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి జనం పట్టం కట్టారన్నారు.

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ విజయంపై ఆ పార్టీ శ్రేణులు సంబురాలు చేశారు.



వెల్దండలో నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి పెద్ద ఎత్తున సంబురాలు చేసుకున్నారు.

కొల్లాపూర్ పట్టణంలో మాజీ జడ్పీటీసీ హన్మంత్ నాయక్, కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ మేకల నాగరాజు, సింగిల్‌విండో సొసైటీ డైరెక్టర్ పసుపుల నరసింహులు, రంగినేని జగదీశ్వరుడు, ఆకునమోని రాము యాదవ్ ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. కల్వకుర్తి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు బాణసంచా స్వీట్లు పంచుకున్నారు. వెల్దండ, ఊర్కొండ, కోడేరు, తెలకపల్లి, లింగాల, మన్ననూరు, చారకొండ మండలాల్లో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి, సంబురాలు చేసుకున్నారు.



కొల్లాపూర్‌లో కాంగ్రెస్ నాయకుల సంబురాలు



వంగూరులో సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించండి

- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలోనే ధాన్యం విక్రయించాలని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని నెల్లికొండ వ్యవసాయ మార్కెట్‌లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఏ-గ్రేడు రకానికి క్వింటాలుకు రూ.2389, సాధారణ రకం వరి క్వింటాలుకు రూ.2369 మెప్మా చెల్లిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, మాజీ కౌన్సిలర్లు, డైరెక్టర్లు, వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెంచాలి

- డీఈవో రమేష్ కుమార్

తెలకపల్లి, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో రమేష్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జమిస్తాపూర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. బాలల దినోత్సవం వేడుకలు నిర్వహించగా డీఈవో పరిశీలించారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించిన డీఈవో విద్యార్థుల ప్రమాణాలను పరిశీలించి విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సూచించారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

- డాక్టర్ పగిడాల శ్రీనివాసులు



పెద్దకొత్తపల్లిలో మాట్లాడుతున్న పగిడాల శ్రీనివాసులు

పెద్దకొత్తపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మత్స్య కార్మిక దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 21న కొల్లాపూర్ పట్టణంలో నిర్వహించే భారీ బహిరంగ సభను వి జయవంతం చేయాలని డాక్టర్ పగిడాల శ్రీనివాసులు కోరారు. శుక్రవారం పెద్దకొత్తపల్లిలోని పీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో మండల మత్స్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండలస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బహిరంగ సభకు తాలూకాలోని మత్స్య కార్మిక సంఘం ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు నాయకులు సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

● కోడేరు (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 21న ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని జయప్రదం చేద్దామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు డాక్టర్ పగిడాల శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో మత్స్యకార సహకార సంఘం భవనంలో వివిధ గ్రామాల మత్స్యకార సంఘం సభ్యులను అధ్యక్ష, కార్యదర్శులు, చైర్మన్లు, యువకులతో సమావేశం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మత్స్య కార్మికసంఘం నాయకులు బయ్య వెంకటస్వామి, పెబ్బేటి కృష్ణయ్య, చెంది వెంకట స్వామి, డబ్బు ఎల్లయ్య, వుట్ట ఆంజనేయులు, శ్రీనివాసులు, లక్ష్మయ్య, కోడేరు మండలంలోని పలు గ్రామాల అధ్యక్షులు, ఉపాధ్యక్షుడు, చైర్మన్లు, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్వీ వేడుకలు

మన్ననూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మన్ననూరు నిరంజన్ షా వలీ దర్గా వద్ద ముస్లిములు గ్యార్వీ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గంధాన్ని గ్రామంలో ఊరేగించారు. ముస్లిములు దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శుక్రవారం రాత్రి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఎండీ ఇస్మాయిల్, అజ్మత్, మేహరాజ్ పాల్గొన్నారు.

బీసీ బాలుర గురుకులం పరిశీలన

కల్వకుర్తి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని ఎంజేపీ బీసీ బాలుర గురుకులాన్ని శుక్రవారం తహసీల్దార్ ఇబ్రహీం, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, నాయకులు సందర్శించారు. గురుకులంలోని విద్యార్థులను ఓ ఉపాధ్యాయుడు కట్టెతో కొట్టడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. సందర్శించిన వారిలో అగ్రికల్చర్ ఆఫీసర్ సురేష్, కల్వకుర్తి పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పసుల రమాకాంత్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'బహుజన రాజ్యాధికారమే లక్ష్యం'

చారకొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : బహుజన రాజ్యాధికారమే తమ లక్ష్యమని ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ కన్వీనర్లు చింతపల్లి ఆశోక్‌గౌడ్, నాగార్జున అన్నారు. ఈనెల 16న జిల్లా కేంద్రంలోని సాయిగార్డెన్‌లో నిర్వహించే ఎస్సీ, ఎస్టీ, బీసీ రాజ్యాధికార సాధన, ఐక్య కార్యాచరణ వేదిక ఏర్పాటుకు నిర్వహించే కరపత్రాలను శుక్రవారం మండల కేంద్రంలో విడుదల చేశారు. మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ నాయకులు చారకొండ చంద్రశేఖర్, మల్లేష్, వెంకటేష్, విజయ్, కొండల్, రామకృష్ణ, సురేష్‌నాయక్ పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీల అందజేత

బిజినేపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మమ్మాయిపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ నక్క శివాజీ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు, తోటి ఆర్మీ జవాన్లు శుక్రవారం బాలల దినోత్సవం పురస్కరించుకొని రూ.80 వేలవిలువైన డ్యూయల్ డెస్క్ బెంచీలను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ వంతుగా సహకారం అందించిన దాతలకు విద్యార్థుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దాతలు శ్రీను, మల్లేష్, అంజి, శంకర్, శివాజీ కుటుంబ సభ్యులను ఎంఈవో రఘునందన్ శర్మతో కలిసి శాలువా, పూలదండలతో ఘనంగా సన్మానించారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

పెంట్లవెల్లి నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాధవస్వామినగర్‌లో శుక్రవారం పెంట్లవెల్లి సొసైటి ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగిల్‌విండో మాజీ చైర్మన్ రామన్‌గౌడ్, మండల నాయకులు నరసింహ మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి లబ్ధిపొందాలని కోరారు. సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి గోవర్ధన్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనల ప్రకారం 14 శాతం తేమ శాతం ఉన్న మొక్కజొన్నకు క్వింటాల్‌కు రూ. 2400 మద్దతు కల్పించిందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వికాస్, సొసైటీ సీఈవో వెంకటనర్సు, నాయకులు ఎర్ర శ్రీను, ఉస్సేన్ ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థుల అవస్థలు

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్

అచ్చంపేటటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యార్థులకు ఎన్నో హామీలు ఇచ్చి నెరవేర్చలేదన్నారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతారన్నారు. తక్షణమే స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ సభ్యులు చరణ్, చందు, సంతోష్ ప్రవీణ్, శివ, తరుణ్, విజయ్ పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతకు, ఏకాగ్రత సాధనకు హెల్ప్

తాడూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మానసికంగా ప్రశాంతంగా ఉండేందుకు హెల్ప్ కార్యక్రమం దోహదం చేస్తుందని స్టూడెంట్ కౌన్సెలర్ డాక్టర్ నర్రా ప్రవీణ్‌రెడ్డి అన్నారు. బాలల దినోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రంలోని కూచకుళ్ల సౌభాగ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మానసిక ప్రశాంతపై అవగాహన కల్పించారు. మెడిషన్, రిలాక్సేషన్, క్లీనింగ్ కార్యక్రమాలను కొన్ని రోజులుగా పిల్లలతో ఆయన చేయిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లెక్చరర్ ఎన్ మురళీకృష్ణ, ఉపన్యాసకులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మానసిక ప్రశాంతతపై అవగాహన కల్పిస్తున్న స్టూడెంట్ కౌన్సెలర్ నర్రా ప్రవీణ్‌రెడ్డి

జంతు సంరక్షణ చట్టాలు అమలు చేయాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జంతు సంరక్షణ చట్టాలను కఠినంగా అమలు చేసి వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్‌పీసీఏ సభ్యులు, పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారులు, మునిసిపల్, పోలీస్ శాఖల ప్రతినిధులు, స్థానిక సంస్థల ప్రతినిధులతో కలిసి జంతుసంక్షేమంపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జంతు సంక్షేమ కార్యక్రమాల అమలు, జంతువుల అక్రమ రవాణా నిరోధం, వధశాలలు, పశువుల మార్కెట్లలో సౌకర్యాలు, తాగునీటి ఏర్పాట్లు, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ మునిసిపాలిటీల్లో ఏబీసీ కేంద్రాల ఏర్పాటు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలకపల్లి, అచ్చంపేట, బిజినేపల్లి సంతల్లో జంతువులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జ్ఞాన శేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్‌రావు, సీపీవో సుజాత, డీఎస్పీ బుర్రి శ్రీనివాసులు, సెక్టోరియల్ అధికారి బడపటి వెంకటయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు బిర్సాముండా జయంతి

జిల్లాలో ఆదివాసీల ఆరాధ్యదైవం, మహానాయకుడు బిర్సాముండా జయంతిని నవంబరు 15న ఘనంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు అవసరమైన ఏర్పాట్లు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ అధికారిని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. శనివారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో నిర్వహించే జయంతి కార్యక్రమానికి గిరిజనులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కలెక్టర్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలి

- జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్‌రావు

వంగూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రైతులకు విత్తనాల, ఎరువుల సరఫరాలో పారదర్శకత కోసం బయోమెట్రిక్ విధానంలో అమ్మకాలు జరపాలని జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్‌రావు సూచించారు. శుక్రవారం వంగూరు మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవ కేంద్రాన్ని, ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల అమ్మకాలు, నిల్వల రికార్డులను పరిశీలించారు. అనంతరం రైతువేదికలో అగ్రి ఇన్‌పుట్ డీలర్లతో సమావేశం నిర్వహించి ముఖ్యమైన సూచనలు చేశారు. నకిలీ విత్తనాలు, పురుగుల మందుల విక్రయాన్ని నిలువరించడం, ఎరువులు కేవలం పాస్ మిషన్ ద్వారా మత్రమే అమ్మడం, ధరలు లైసెన్స్ వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలన్నారు. సీజన్‌కు సరిపడిన ఎరువుల నిల్వలను డీలర్లు తప్పని సరిగా ఉంచాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఏవో ప్రియదర్శిని, ఏఈవోలు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

మధుమేహంపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా ఉప వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.వెంకటదాస్

కందనూలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు మధుమేహం గురించి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఉప వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.వెంకటదాస్ అన్నారు. మండల పరిధిలోని పెద్దముద్దునూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి ప్రస్తుత సమాజంలో మధుమేహ వ్యాధి పరిస్థితి, కలిగే దుష్ప్రభావాలు పరిష్కార మార్గాల గురించి అవగాహన కల్పించారు. మధుమేహం ఒక దీర్ఘ కాల సమస్య అని, నియంత్రణలో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కృష్ణమోహన్, వైద్యాధికారి డాక్టర్ వాణి, డాక్టర్ సుప్రియ, జిల్లా ఉప మాస్ మీడియా అధికారి రాజగోపాలచారి, ఎన్‌సీడీ కో ఆర్డినేటర్లు విజయ్, మల్లేష్, ఎంఎల్ హెచ్‌పీలు, పర్యవేక్షకురాలు జ్యోతి, ప్రమీల, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

● మన్ననూర్ (ఆంధ్రజ్యోతి) : మధుమేహ వ్యాధి నిర్మూలనకు రోగులు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారులు డాక్టర్ సుధాకర్, డాక్టర్ పానుగంటి జాన్సన్ కోరారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు పీహెచ్‌సీలో శుక్రవారం రోగులకు అవహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ మారతమ్మ, ఏఎన్‌ఎంలు రామలింగమ్మ, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వి.పర్వతాలు

పెద్దకొత్తపల్లి, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయని, కార్మికుల హక్కుల సాధనకై ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వి.పర్వతాలు కోరారు. శుక్రవారం స్థానిక రెడ్డి కమ్యూనిటీ హాల్‌లో సీఐటీయూ మండలం మహాసభ జరిగింది. ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు ఇంద్రకంటి బాలస్వామి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దశరథం, ఐకేపీ వీవోఏల సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య, జిల్లా కార్యదర్శి కళావతి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మధు, గ్రామపంచాయతీ వర్కర్స్ మండల నాయకులు రాజేందర్, మల్లయ్య, అంగన్‌వాడీ యూనియన్ జ్యోతి, ఆలివేల, సులోచన, ఆశావర్కర్ యూనియన్ నాయకురాలు రాణి పాల్గొన్నారు.



పెద్దకొత్తపల్లిలో మాట్లాడుతున్న వి.పర్వతాలు

ఆరోగ్యంగా జీవించాలంటే వ్యాయామం తప్పనిసరి

- లయన్స్‌క్లబ్ గవర్నర్ మహేంద్రకుమార్‌రెడ్డి

కల్వకుర్తి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సమాజంలోని ప్రతీ ఒక్కరు ఆరోగ్యంగా జీవించాలంటే శారీరక శ్రమ, వ్యాయామం అవసరమని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మహేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలో లయన్స్ క్లబ్ కల్వకుర్తి, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ సంయుక్త ఆధ్వర్యంలో డయాబెటిక్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ఆహారపు అలవాట్లు వ్యవహార శైలీ ఈ వ్యాధి వ్యాప్తికి ప్రధాన కారణమన్నారు. 45మందికి పరీక్షలు లయన్ సంపత్‌కుమార్ నిర్వహించారు. ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ కల్వకుర్తి అధ్యక్షుడు చిగుళ్లపల్లి శ్రీధర్, ఆమనగల్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, డయాబెటిక్ క్యాంపు చైర్మన్ వాడకట్టు సంపత్‌కుమార్, మాజీ గవర్నర్ జూలూరు రమేష్‌బాబు, రీజియన్ కార్యదర్శి తలసాని వెంకట్‌రెడ్డి, డాక్టర్ దామోదర్‌రెడ్డి, డాక్టర్ శివరాం, కల్వకుర్తి క్లబ్ కార్యదర్శి కల్మచెర్ల గోపాల్, నరసింహారెడ్డి, కల్వ మనోహర్, చంద్రశేఖర్, గుబ్బ కిషన్, శివ, జగదీశ్వర్, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, మయూరి వేణు పాల్గొన్నారు.

భారత తొలి ప్రధానికి ఘన నివాళి

- జిల్లాలో ఘనంగా బాలల దినోత్సవం
- ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శనలు
- పోటీలలో విజేతలకు బహుమతులు

కొల్లాపూర్/ అచ్చంపేటటౌన్/ కల్వకుర్తి/ ఉప్పునుంతల/ ఊర్కొండ/ పెద్దకొత్తపల్లి/ తెలకపల్లి/ మన్ననూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా జాతీయ బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వ్యాసరచన, ఉపన్యాస, ఇతర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

• కొల్లాపూర్ పట్టణంలో టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. • అచ్చంపేటలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ బాలల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. డీడబ్ల్యూవో రాజేశ్వరి పట్టణంలోని బాలసదన్‌లో చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. • కల్వకుర్తి పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ ప్రధాని దివంగత నెహ్రూ చిత్రపటానికి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఈవో శంకర్‌నాయక్ పాల్గొన్నారు. • ఉప్పునుంతల మండలంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శ్రీనివాసురెడ్డితో పాటు ఉపాధ్యాయులు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. •ఊర్కొండ మండలంలోని పాఠశాలల్లో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. •పెద్దకొత్తపల్లి మండలం పెద్దకార్పాముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవం ప్రధానోపాధ్యాయులు జియావుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. • తెలకపల్లిలోని సిద్ధార్థ మోడల్ స్కూల్‌లో బాలల దినోత్సవం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ఎం శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. • అమ్రాబాద్ మండలం మన్ననూరులోని ప్రభుత్వ పాఠశాలలు, పీటీజీ, సాంఘిక సంక్షేమ గురుకులాల్లో నెహ్రూ చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీటీజీ, సాంఘిక సంక్షేమ గురుకులాల ప్రిన్సిపాళ్లు పద్మావతి, రూపాదేవి, జీటీడబ్ల్యూ హెచ్‌ఎం సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.



పెద్దకొత్తపల్లి : పెద్దకార్పాముల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంబురాలు



అచ్చంపేట : బాలసదన్‌లో చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపిన డీడబ్ల్యూవో రాజేశ్వరి



కల్వకుర్తి : బాలల దినోత్సవం..